జీతాలు ఇవ్వాలంటూ విన్నపం

కలెక్టరేట్: జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు జీతాలు కోసం నిరీక్షిస్తున్నారు. ఒకటి రెండు నెలలు కాదు. 14 నెలల నుంచి జీతాలు అందకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. తమ కుటుంబాలను ఎలా పోషించుకోలని ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగంలో 2016 నుంచి వివిధ కేడర్‌లలో 268 మంది సిబ్బంది పని చేస్తున్నారు. తమకు జీతాలు ఇచ్చే వరకూ విధుల్లోకి రాబోమని సిబ్బంది ప్రకృతి వ్యవసాయ డీపీఎం అనందరావుకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

- టీడీపీ టిక్కెట్లపై వీడిన ఉత్కంఠ
- చీపురుపల్లికి కళా వెంకటరావు
- విజయనగరం లోక్‌సభకు కలిశెట్టి
- గెలుపు గుర్రాలకే కూటమి పట్టం





ఇక సమరమే..

ఉత్కంఠ వీడింది.. ఎన్నికల సంగ్రామంలో ఎవరెవరు నిలిచేదీ తేలిపోయింది. చీపురుపల్లి, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థులను తాజాగా కూటమి ప్రకటించింది. కిమిడి కళావెంకట్రావు, కలిశెట్టి అప్పలనాయుడుకు అవకాశం ఇచ్చింది. ఇక మహాసంగ్రామం మొదలు కావడమే మిగిలింది. ఇప్పటికే కొందరు ప్రచారం ప్రారంభించినప్పటికీ అభ్యర్థుల జాబితా మొత్తం తేలకపోవడంతో ఆ జోరు కనిపించలేదు. కీలక నాయకులు పలువురు గుంబనంగా ఉండిపోయారు. ఇప్పుడు అందరూ కలిసి ప్రజల వద్దకు వెళ్లనున్నారు. వాగ్బాణాలు సంధించనున్నారు.

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మిగిలిన రెండు నియోజవర్గాల అభ్యర్థులను టీడీపీ శుక్రవారం ప్రకటించింది. చీపురుపల్లి అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా కిమిడి కళావెంకట్రావును ఎంపిక చేసింది. కూటమిలో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయించిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి ఎన్.ఈశ్వరరావు(బీజేపీ) పోటీకి దిగుతున్నారు. ఆ టిక్కెట్టు ఆశించిన కళావెంకట్రావుకు చీపురుపల్లి అసెంబ్లీ టిక్కెట్టు కేటాయింపు అనివార్యమైంది. స్పష్టత రావడంతో గత కొద్దిరోజులుగా సాగిన ఉత్కంఠతకు తెరపడింది. ఈసారి ఎన్నికల్లో అధికార వైసీపీని ఓడించేందుకు త్రిముఖ వ్యూహంతో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కట్టాయి. ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను ధీటుగా ఎదుర్కొనేందుకు గెలుపు గుర్రాలను ప్రకటించాయి. ముఖ్యంగా కొత్తవారికి, యువతకు ప్రాధాన్యం ఇచ్చిన పరిస్థితి కన్పించింది. చీపురుపల్లిలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి బొత్స సత్యనారాయణ మరోసారి వైసీపీ నుంచి టిక్కెట్ పొంది పోటీలో నిలిచారు. ఆయనకు గట్టి పోటీ ఇచ్చే అభ్యర్థి కోసం టీడీపీ అనేక సమాలోచనలు చేయాల్సి వచ్చింది. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును బరిలోకి దింపుతారని ప్రచారం జరిగింది. చివరికి టీడీపీ సీనియర్ నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కళావెంకట్రావును ఎంపిక చేసింది.



బొత్సకు దీటుగా కళా

ఇద్దరు నాయకులు మంత్రులుగా, పార్టీల రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు. ఇద్దరూ సీనియర్లే. పైగా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. బొత్సకు చీపురుపల్లిలో ప్రతి కూల పవనాలు వీస్తున్న విషయం తెలిసిందే. దీనిని గుర్తించిన ఆయన ఇటీవల చీపురుపల్లి నియోజకవర్గంలోనే తిష్టవేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ కార్యక్రమం జరిగినా హాజరవుతున్నారు. కీలక బాధ్యతలను మేనళ్లుడు చిన్న శ్రీనుకు అప్పగించేవారు. కానీ ప్రస్తుతం తానే స్వయంగా చూస్తున్నట్లు సమాచారం. ఈ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు పెరిగాయి. ముఖ్య నేతలు సైతం టీడీపీ జెండా పట్టారు. మెరకముడిదాం మండలానికి చెందిన కోట్ల సుగుణాకరరావు వంటి పెద్దలు అనుచరులతో టీడీపీలో చేరారు. గద్దె బాబారావు కూడా బీజేపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. దీనికి తోడు చీపురుపల్లితో కిమిడి కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉంది. ఏదైనాగాని ఈసారి నువ్వా నేనా అన్నట్టుగా పోటీ సాగనుంది.



అశోక్ వారసురాలిగా అదితి

విజయనగరం నుంచి అదితి గజపతిరాజు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చి స్వల్పఓట్ల తేడాతో ఓటమి చెందారు. గతంలో తండ్రి అశోక్ గజపతిరాజుకు ఎన్నికల్లో ప్రచార సారధిగా ముందుండి నడిపించారు. ఈ సారి తండ్రి తప్పుకున్న కారణంగా కుమార్తె బరిలో నిలిచారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు తోడు స్థానిక ఎమ్మెల్యేపై ఉన్న అసంతృప్తి కూడా అదితికి కలసిరానుంది. ఎమ్మెల్యే అవినీతి అంశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. మరోవైపు ఇటీవల కాలంలో కీలక వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మాజీ కౌన్సిలర్లు, మాజీ అర్బన్ అధ్యక్షులు, 8వ డివిజన్ కార్పొరేటర్ ఇలా వైసీపీ నుంచి టీడీపీలోకి క్యూ కట్టారు. పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కాళ్ల గౌరీశంకర్ తదితర కీలక నాయకులు టీడీపీ కోసం పనిచేస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి లలితకుమారి

శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి టిక్కెట్టు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ టీడీపీకి బలమైన కేడర్ ఉంది. 1962నుంచి ఈ కుటుంబానికి చెందిన వారే ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. లలితకుమారి మామ కోళ్ల అప్పలనాయుడు 1962, 67, 85, 89, 94, 99 ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి కట్టుబడి కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉంది. దీనికి తోడు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఇంటి పోరు తప్పటం లేదు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఇటీవలే ఎమ్మెల్సీ రఘురాజు సతీమణి సుధారాజు నాయకత్వంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరారు. ఈ పరిణామాలన్నీ లలితకుమారికి కలిసి వస్తాయని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.



అందరి మద్దతుతో నాగమాధవి

నెల్లిమర్ల నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. లోకం నాగమాధవికి అవకాశం కల్పించారు. గత 2019 ఎన్నికల్లో కూడా జనసేన అభ్యర్థిగా మాధవి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఈసారి టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. మూడు పార్టీల మద్దతునూ కూడ గట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇక్కడ టీడీపీకి బలమైన కేడర్ ఉంది. నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో మాజీ ఎంపీపీల నాయకత్వంలో శ్రేణులన్నీ పనిచేస్తున్నాయి. టీడీపీ నుంచి టిక్కెట్టు ఆశించిన వారిలో అసంతృప్తి ఉంది. వారిని బుజ్జగించే చర్యలు చంద్రబాబు చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బంగార్రాజుతో చంద్రబాబు ఇప్పటికే ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. అందరూ ఐక్యంగా పనిచేసే పరిస్థితి ఉంది.





విద్యా వంతుడిగా శ్రీనివాసరావు

గజపతినగరం అభ్యర్థిగా యువకుడు, విద్యా వంతుడిగా ఉన్న కొండపల్లి శ్రీనివాసరావును ఎంపిక చేశారు. ఈయన కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చినవారే. తాత కొండపల్లి పైడితల్లి నాయుడు బొబ్బిలి పార్లమెంట్ సభ్యునిగా పనిచేశారు. ఆయన కుమారులు కొండపల్లి కొండలరావు, కొండపల్లి అప్పలనాయుడు(కేపీ నాయుడు)లు రాజకీయాలను కొనసాగిస్తున్నారు. కేపీ ఆయుడు 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సారి యువతకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో కొండలరావు కుమారుడు శ్రీనివాసరావుకు పార్టీ టిక్కెట్టు కేటాయించింది. గజపతినగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యపై తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రజా సంక్షేమం కంటే తన సంక్షేమానికే పెద్దపీట వేశారన్న ఆరోపణలున్నాయి. ఇవన్నీ శ్రీనివాసరావుకు అనుకూలతలే.

ప్రజల్లోనే బేబీనాయన

బొబ్బిలి నియోజకవర్గ అభ్యర్థిగా ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన)ను ఎంపిక చేశారు. ముందునుంచే ఈ అభ్యర్థిత్వం ఖరారుకానున్న సంకేతాలున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎన్నికల నుంచి తన సత్తాను చాటుతూ ముందుకు సాగుతున్నారు. ఈయన కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వారే. తాత ఆర్ఎస్ ఆర్‌కే రంగారావు మద్రాస్ ప్రెసిడెన్సీలో సీఎంగా పనిచేశారు. తండ్రి ఆర్‌వీజీకే రంగారావు ఎంపీగా పనిచేశారు. సోదరుడు సుజయ్ కృష్ణరంగారావు టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. బేబీనాయన బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పట్టు సాధించారు. అన్ని మండలాల్లోనూ తనకంటూ గుర్తింపున్న నాయకత్వాన్ని తయారు చేసుకున్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు.





పటిష్టమైన కేడర్‌తో మురళీమోహన్

రాజాం నియోజవర్గ టీడీపీ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌ను ఎంపిక చేశారు. ఈయన కొన్నేళ్లుగా అక్కడే ఉంటూ శ్రేణులను కలుపుకుని వెళ్తున్నారు. పటిష్ట కేడర్‌ను తయారు చేశారు. వైసీపీ అసంతృప్తి నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తూ పార్టీని పటిష్టం చేస్తున్నారు. రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాల్లో ఎన్నికల ప్రచారంలో జోరు పెంచారు. అక్కడి వైసీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉంది. ఆ నియోజకవర్గంలో ఇసుక మాఫియా పెద్ద ఎత్తున జరుగుతోంది. భూముల కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రజల్లో వ్యతిరేకత ఉంది. మరోవైపు అనేకసార్లు కోండ్రు ప్రజా సమస్యలపై ఉద్యమం చేశారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఇవన్నీ మురళీమోహన్‌కు అనుకూలతలే.



ఇరుకు గదిలో రెడ్డివానివలస పాఠశాల



ఊడుతున్న స్లాబ్

బడులు ఇలా.. చదువులు ఎలా?

ఒకచోట ఇరుకు ఇల్లే పాఠశాల..
ఇంకోచోట శిథిల భవనమే గతి

మెంటాడ, మార్చి 29: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ సొంత జిల్లా, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర సొంత నియోజకవర్గంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల దుస్థితి అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందికి ప్రాణ సంకటంగా పరిణమించింది. ఒకచోట ఇరుకు అద్దె ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్నారు. మరో పాఠశాలలో ఎప్పటికప్పుడే స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుంటాయి. సంవత్సరాలుగా వీటి దుస్థితి మారడం లేదు.

మెంటాడ మండలంలోని కొండలింగాలవలస పంచాయతీ రెడ్డివానివలస గ్రామ పాఠశాలలో 28 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు టీచర్లు పనిచేస్తున్నారు. సుమారు ఏడెనిమిది సంవత్సరాల క్రితమే ఈ భవనం అప్పటి తుఫాన్‌కు కూలిపోయింది. అప్పటి నుంచి ఓ ఇంట్లో తరగతులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆ ఇంటి అద్దె కూడా టీచర్లే భరిస్తున్నారు. ఇరుకైన రెండు గదుల్లో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక తరగతి గదిలో సిమెంట్ బస్తాలు వేశారు. మిగిలిన కొద్ది స్థలంలో సర్దుకుని కూర్చొంటున్నారు. కొత్త భవన నిర్మాణాన్ని నాడు-నేడు పథకంలో భాగంగా చేపట్టినప్పటికీ నత్తనడకన సాగుతోంది. బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశారు.

- గురమ్మవలస పాఠశాల దుస్థితి మరీ దయనీయం. నాడునేడులో చేర్చినా పనులు ప్రారంభమే కాలేదు. పాత భవనం పూర్తిగా శిథిలమైంది. చినుకు పడితే జలమయం అవుతోంది. వర్షాకాలంలో స్థానిక శివాలయంలో పాఠశాలను నడుపుతున్నారు. వేసవిలో ఎలాగోలా నెట్టుకొస్తున్నారు. స్లాబ్ పెచ్చులూడి పడుతుంటాయని పిల్లలు వాపోతున్నారు.



నిర్మానుష్యంగా విజయనగరం ప్రధాన రహదారి

భానుడి భగ..భగ

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ బొబ్బిలి/ రాజాం

కర్ఫ్యూను తలపించిన రహదారులు

వాతావరణం వేడెక్కింది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. జిల్లాలో చాలా చోట్ల శుక్రవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వడగాడ్పులు కూడా తోడవడంతో రహదారులు కర్ఫ్యూను తలపించాయి. ఎండ తీవ్రత ఇంకా పెరుగుతుందని వాతావరణం నిపుణులు చెబుతున్నారు. విజయనగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట, బొబ్బిలి, రాజాం ప్రాంతాల్లో ఎండ తీవ్రంగా స్పష్టంగా కన్పించింది. ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకూ ప్రజలు పెద్దగా బయటకు రాలేదు. నగరంలోని నిత్యం రద్దీగా వుండే అన్ని కూడళ్లూ బోసిపోయాయి. కోట జంక్షన్ నుంచి మూడులాంతర్లు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, అంబేడ్కర్ జంక్షన్ రోడ్డు ఇలా అన్నీ నిర్మానుష్యంగా మారాయి. బయట పనులు చేసే కూలీలు, కార్మికులు ఎండ వేడికి తాళలేక ఇబ్బందులు పడ్డారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

విజయనగరం(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అన్ని చర్చిల్లో ఉదయం నుంచే సంకీర్తనలు, ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు జరిగాయి. ఏసుక్రీస్తుకు శిలువ వేసే రోజును గుడ్‌ఫ్రైడే (శుభ శుక్రవారం)గా క్రైస్తవులు జరుపుకుంటారు. జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో ప్రార్థనలతో పాటు ఏసు భక్తి గీతాలు ఆలపించారు. మానవాళి కోసం యేసు ప్రభువు చేసిన కృషి, ప్రాణ త్యాగాన్ని క్రైస్తవ సోదరులకు పాస్టర్లు వివరించారు. నగరంలోని సిమ్స్ ప్లాటినం బాప్టిస్ట్ చర్చితో పాటు ఆర్‌సీఎం, తెలుగుబాప్టిస్ట్ చర్చి, కంటోన్మెంట్ చర్చి తదితర చర్చిల్లో ప్రార్థనల అనంతరం ఏసు కీర్తనలు ఆలపిస్తూ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.



విజయనగరంలో క్రైస్తవుల ర్యాలీ



పేదలకు అండగా టీడీపీ

- 40 ఏళ్లు ఎన్నో పదవులు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నా
- ప్రస్తుతం రాష్ట్రంలో విధ్వంసం, దోపిడీ తప్ప మరొకటి లేదు
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, మార్చి 29: ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా టీడీపీ ప్రజల పక్షానే నిలబడిందని, పేద ప్రజలకు అండగా నిలిచిందని టీడీపీ సీనియర్ నేత, ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజు చెప్పారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. టీడీపీ ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకూ అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా, ప్రజా సమస్యలపైనే పోరాటాలు చేసిందన్నారు. ఈ క్రమంలో ఎంతో మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ ప్రాణాలు సైతం త్యాగం చేశారని, వారి సేవలు మరిచిపోలేనివన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా అరాచక పాలన సాగిందని, విధ్వంసం, దోపిడీ, అరెస్టులు తప్ప మరొకటి లేదన్నారు. తిరోగమనంలో వున్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలంటే చంద్రబాబు లాంటి విజనరీ నాయకుడు రాష్ట్రానికి అవసరమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు చారిత్రాత్మక అవసరమన్నారు. 40 ఏళ్ల ప్రస్థానంలో తాను పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, నాలుగు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా, ఒక దఫా కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వహించే అవకాశం టీడీపీ ద్వారా లభించిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు చారిత్రాత్మక అవసరమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌లు సునీలా గజపతిరాజు, ప్రసాదుల కనకమహాలక్ష్మీ, ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, కంది మురళీనాయుడు, కర్రోతు రాధామణి, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, గదుల వెంకటరావు, టీడీపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురిని సన్మానించారు.



టీడీపీ జెండా ఆవిష్కరణలో అశోక్‌గజపతిరాజు

ప్రతిఒక్కరూ ఆశీలు చెల్లించాలి

● మునిసిపల్ రెవెన్యూ అధికారి రూబేను



ఆశీలు వసూలుచేస్తున్న ఆర్వో రూబేన్, ఆర్ఐలు

పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరూ ఆశీలు చెల్లించాలని మునిసిపల్ రెవెన్యూ అధికారి డి. రూబేను తెలిపారు. మునిసిపాలిటీలోని ప్రధాన మార్కెట్ పరిధిలో గల ఆశీలు వసూలుకు సంబంధించి ప్రైవేటు కాంట్రాక్టర్ల వసూళ్ల సమయం ఫిబ్రవరితో ముగిసింది. దీంతో నెలరోజులుగా ఆర్వో పర్యవేక్షణలో మునిసిపల్ సిబ్బంది ఆశీలు వసూళ్లలో నిమగ్నమైయ్యారు. శుక్రవారం పట్టణంలోని రాయగడ రోడ్డులో గల గ్రోమోర్ షాపు వద్ద ఆశీలు వసూళ్ల ప్రక్రియలో భాగంగా విలేకరులతో మాట్లాడారు. 2023-24కు గాను మువ్వల వాసుదేవరావు అనే వ్యక్తి ప్రధాన మార్కెట్ పరిధిలో ఆశీలు వసూలుకు సంబంధించి బహిరంగ వేలంలో పాల్గొన్నారని, ఇప్పటి వరకు ఆశీలు వసూలుచేసి మున్సిపాల్టీకి చెల్లించాల్సిన రూ. 15 లక్షలు చెల్లించలేదన్నారు. 2024-25లో ఆశీలు వసూలుకు సంబంధించి ఎవరూ పాటదారులు పాల్గొనకపోవడంతో మునిసిపల్ సిబ్బంది వసూళ్లకు సిద్ధమయ్యారని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సిబ్బందితో ఆశీలు వసూలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు పి. నారాయణరావు, వినయ్‌లు పాల్గొన్నారు.

ఐటీఐ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పండు, రాజశేఖర్

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలో ఐటీఐ పరీక్షకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పండు, రాజశేఖర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. జిల్లా వ్యాప్తంగా ఐటీఐకళాశాలలకు సంబంధించి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పార్వతీపురం,సీతానగరం, బలిజిపేట,సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేటల్లో గల విద్యార్థులు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నాలకు వెళ్లి పరీక్షలు రాయల్సివస్తోందని తెలిపారు. జిల్లా కేంద్ర పరిధిలో ఉన్న ఐటీఐల్లో విద్యనభ్యసించి ఇతర జిల్లాలకు వెళ్లి పరీక్షలు రాయడం వల్ల శ్రమతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో జూలైలో జరిగే పబ్లిక్ పరీక్షలను మన్యం జిల్లా కేంద్రంలో నిర్వహించాలని, డీఆర్వో కేశవ నాయుడుకు వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

రాయగడ జమ్ములో పశువైద్య శిబిరం



మూగజీవాలకు వ్యాక్సిన్లు వేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ములో శుక్రవారం నాబార్డు, జీవ జట్టు సంస్థ, పశు సంవర్ధకశాఖలు సంయుక్తంగా పశువైద్య శిబిరం నిర్వహించాయి. ఈసందర్భంగా గొరడ వెటర్నరీ డాక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగాఉండడంతో పశువులు, మేకలు,గొర్రెలు, కోళ్లను సురక్షితంగా చూసుకోవాలని తెలిపారు. మూగజీవాలకు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు పి.ధర్మారావు, జీవ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.ప్రబోద్, మురళీమోహన్, రైతులు రామారావు, చిరంజీవి, నీరజ, కొత్తమ్మ పాల్గొన్నారు.

ఆరోతరగతిలో ప్రవేశానికి గడువు పెంపు

భామిని: స్థానిక ఆదర్శపాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు ఏప్రిల్ ఆరో తేదీ వరకు గడువు పెంచినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాల సెక్రటరీ ఆదేశాల మేరకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఐదో తరగతి చదువుతున్న ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 21న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.ఇందులో మెరిట్ పొందిన వారికి సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

కూర్మరాజుపేట రోడ్డులో వాహన తనిఖీలు



కూర్మరాజుపేట రోడ్డు వద్ద కారును తనిఖీచేస్తున్న పోలీసులు

సాలూరు రూరల్: పట్టణ సరిహద్దులో ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు.మామిడిపల్లి నుంచి పట్టణంలోకి వచ్చే ప్రతివాహనాన్ని కూర్మరాజుపేట రోడ్డు వద్ద పరిశీలించారు.

లక్ష్మణ్‌నాయక్ త్యాగాలు మరువలేం

● రాయగడ జిల్లా కలెక్టర్ ప్రమోద్ సత్యవాన్ మహాజన్



షాహిద్ లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రమోద్ సత్యవాన్ మహాజన్

ఒడిశా

రాయగడ: స్వాతంత్ర్య సమర యోధుడు షాహిద్ లక్ష్మణ్ నాయక్ త్యాగాలు అజరామమని, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం మరువరానిదని కలెక్టర్ ప్రమోద్ సత్యవాన్ మహాజన్ తెలిపారు. రాయగడలో లక్ష్మణ్ నాయక్ 82వ వర్ధంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. తొలుత స్థానిక కస్తూరి నగర్‌లోని షాహిద్ లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకుడు, విద్యావేత్త డాక్టర్ దుష్యంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ నాయక్ తన జీవితాన్ని దేశ స్వాతంత్ర్యం కోసం, ఒడిశా రాష్ట్రం కోసం త్యాగం చేసిన త్యాగధనుడని కొనియాడారు. అనంతరం ఎస్ఈడబ్ల్యుఈసీ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి, అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్, అదనపు ఎస్పీ బిష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

175 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: పద్మాపూర్ సమితి కెందుగుడ పోలీసుస్టేషన్ పరిధిలోగల సిమిరి గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 175 కిలోల గంజాయిని పద్మాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయం అధికారుల కథనం మేరకు.. కొంతమంది వ్యక్తులుపాలిథిన్ సంచుల్లో గంజాయని నింపుకుని రవాణా చేసేందుకు సిద్ధం చేసుకున్నారు. ఇంతలో ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సిమిరి గ్రామానికి చేరుకున్నారు. పోలీసుల రావడాన్ని పసిగట్టిన వారంతా గంజాయి మూటలను విడిచిపెట్టి పారిపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.







నెల్లిమర్ల: జెండా ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, కొత్తవలస: కేక్ కట్ చేస్తున్న లలితకుమారి, రాజాం: ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కొండ్రు

అరాచక పాలనకు చరమగీతం పలకాలి

● వాడవాడలా టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలు

● పార్టీ పతాకాలను ఆవిష్కరించిన నాయకులు

రాష్ట్రంలో అరాచకపాలనకు చరమగీతం పలకాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించాయి. పార్టీ పతాకాలను ఆవిష్కరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్య క్రమంలో నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు చారిత్రాత్మక అవసరమని తెలిపారు.

-ఆంధ్రజ్యోతి బృందం



చీపురుపల్లి: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున



గజపతినగరం: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్



బొబ్బిలి కోటలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తెంటు, బేబీనాయన

కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

● సాలూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి సంధ్యారాణి

మెంటాడ: పొత్తు విచ్చిన్నానికి వైసీపీ నేతల కుయుక్తుల ను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సాలూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి గుమ్మడి సంధ్యా రాణి తెలిపారు. ప్రత్యర్థి పార్టీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. శుక్రవారం మెంటాడ మండలంలోని కంటుభుక్తవలసలో సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఆర్పీ భంజ్ దేవ్‌తో కలిసి ఎన్నికల వ్యూహంపై పార్టీ మండలాధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ కూటమి పార్టీల నేతలు సహకారం మరువలేనిదని చెప్పారు.ఇదే స్ఫూర్తితో కలిసి ముందుకు సాగుదామని తెలిపారు. భంజ్ దేవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయకేతనం ఎగురవేయడం తథ్యమన్నారు.అభ్యర్థి గెలుపే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. చలుమూరి వెంకట్రావు మాట్లాడుతూ సంధ్యారాణికి అత్యధిక మెజారిటీ వచ్చేలా పట్టుదలతో పనిచేయాలన్నారు.కార్యక్రమంలో జనసేన నాయకులు రిషివర్ధన్,సబ్బవరపు రాజశేఖర్,చింత కాశీ నాయుడు బీజేపీ నేతలు తాడ్డి సూర్యనారాయణ,మనిపూరి అప్పల నాయుడు పాల్గొన్నారు.



మెంటాడ: మాట్లాడుతున్న సంధ్యారాణి

అభిమానులతో బంగార్రాజు సమాలోచనలు

భోగాపురం: నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అభిమానులతో సమాలోచనలు నిర్వహించారు. రెండు మూడు రోజుల్లో టీడీపీ అధిష్ఠానం అవకాశం ఇవ్వకపోతే పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు. శుక్రవారం మండలంలోని పోలిపల్లిలో నియో జకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. తొలుత పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ కష్టపడినవారిని టీడీపీ గుర్తించలేదని, అందుకే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయాలని అభిప్రాయపడ్డారు. అనంతరం కర్రోతుబంగార్రాజు మాట్లాడుతూ ఇక్కడ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టప డ్డానని తెలిపారు. అధిష్ఠానం చెప్పిన, అప్పగించిన అన్ని పనులు రాష్ట్రంలో నెల్లిమర్ల నియోజకవర్గం ముందుండేలా కష్టపడి పని చేశానన్నారు.అయితే ఇక్కడ పది శాతం ఓట్లుకూడా లేని జనసేనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చారన్నారు. తనను పిలిసి భీమిలి ఎమ్మెల్యే టిక్కెట్ లేదా విజయనగరం ఎంపీ టిక్కెట్ ఇస్తామని చంద్రబాబు నాయుడు చెప్పారన్నారు. ఆశతో ఎదురుచూసిన తనకు ఎక్కడా కూడా సీటు ఇవ్వకపోవడంతో అసంతృప్తిగా ఉందన్నారు. నాయకులు సహకరించకపోయినా నావెంట ప్రజలు, అభిమానులు ఉన్నారన్నారు. ఇంటింటికి వెళ్లి జరిగిన అన్యాయాన్ని వివరిస్తామని తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిసి తీరుతాన్నారు. కార్యక్రమంలో సువ్వాడరవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు, కర్రోతు సత్యనారాయణ, దంగాభూలోక, ఇజ్జురోతు ఈశ్వరరావు, వెంపడపు సూర్యనారాయణ, మైలపల్లి సింహాచలం, భోగాపురం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వ ఏర్పాటు తథ్యం: శ్రీనివాస్

బొండపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని ఆ పార్టీ గజపతినగరం నియోజకవర్గం అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బోడసింగిపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా మూడు పార్టీల పొత్తుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గెలుపునకు కృషి చేయాలన్నారు. దివాలా తీసిన రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మూడు చేతులు కలిసి పనిచేయాలన్నారు. అధికారం వస్తే అన్నక్యాంటీన్లను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. .సూపర్‌సిక్స్ పథకాలతో నిరుపేదలకు సంక్షేమం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాగళంతో రానున్న ఎన్నికల్లో ప్రజాబలం నిరూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్ పాల్గొన్నారు.

యువత కలలను సాకారం చేస్తా

● నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి మాధవి

డెంకాడ: యువతకు ఉద్యోగాలు కల్పించి, వారి కలలు సాకారం చేస్తానని నెల్లిమర్ల నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి లోకం మాధవి హామీ ఇచ్చారు. ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతానని తెలిపారు. శుక్రవారం మండలంలోని చొల్లంగిపేట, డి.కొల్లాం పంచాయతీల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఐదేళ్లుగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేదని విమర్శించారు. టీడీపీ నాయకుడు చంద్రశేఖర రావు మాట్లాడుతూ ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, సువ్వాడ రవిశేఖర్, నాయకులు గేదెల రాజారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న లోకం మాధవి

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి నాగార్జున రాజీనామా

చీపురుపల్లి: చీపురుపల్లి శాసనసభ స్థానం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళా వెంకటరావుకు పార్టీ అధిష్ఠానం కేటాయిం చడంతో స్థాని క నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా అధక్ష పదవికి కిమిడి నాగార్జున రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం చీపురుపల్లిలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటుచేసుకుని నాలుగేళ్లపదినెలలపాటు పార్టీ కార్యకర్తలు, ప్రజలతో మమేకమయ్యానని తెలిపారు.మంత్రి బొత్సకు దీటుగా తయారై, ప్రభుత్వాన్ని ఎండగట్టానన్నారు. కేసులకు భయపడ కుండా పోరాటం చేశానన్నారు. నిబద్ధతతో పార్టీ కోసం పని చేశానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉన్నానని, సొంతంగా ఓటు బ్యాంకును కూడగట్టుకోగలిగానని చెప్పారు.2019లో తనకు టికెట్ ఇచ్చినప్పటి నుంచి పార్టీ కోసం పని చేశానన్నారు.పార్టీ నిర్ణయంపై ఎవరినీ నిందించ దలుచుకోలేదని తెలిపారు. అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించి తన నిర్ణయాన్ని రెండు రోజుల్లో ప్రకటిస్తానని నాగార్జున చెప్పారు.కాగా నాగార్జునకు టికెట్ నిరాక రించడంతో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, దన్నాన రామచంద్రుడు, తాడ్డి సన్యాసినాయుడు, సారేపాక సురేష్, వెన్నె సన్యాసినాయుడు, ముల్లు రమణ తదితరులు తమ తమ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నాగార్జున నివాసం వద్ద, మూడు రోడ్ల కూడలిలో పార్టీ కార్యకర్తలు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కర పత్రాలనుదహనం చేశారు.



నాగార్జున నివాసం వద్ద కరపత్రాలు దహనం చేస్తున్న కార్యకర్తలు

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

మక్కువ: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ పి.నరసింహార్తి కోరారు. మండలంలోని ఎస్.పెద్దవలసలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందరంగా మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామాల్లో వివాదాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం రోడ్లుకు ఇరువైపులా ఉన్న కల్వర్టులను నిశితంగా పరిశీలించారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **కురుపాంరూరల్:** యేగులవాడలో కురుపాం సబ్‌ఇనస్పెక్టరు షన్ము ఖరావు ఆధ్వర్యంలో కేంద్రబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ యువకులు ఓటుహక్కు వినియోగించుకోవాలని, ఎన్ని కలు సజావుగా సాగేందుకు యువత ముందుకురావాలని పిలుపునిచ్చారు.

టీడీపీలో 100 మంది చేరిక



టీడీపీలో చేరిన యువకులతో విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయు డు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఉపాధి లభిస్తుందనే నమ్మకం తో పార్టీలో చేరుతున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యరి బోనెల విజయచంద్ర తెలిపారు. పార్వతీపురంలో 100 మంది శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిఅభ్యర్థి బోనెలవిజయచంద్ర కండువాలువేసి ఆహ్వానిం చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వహయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేకపోవడంతో పాటు యువతకు ఉపాధి కల్పించలేదని ఆరోపించారు. నియోజకవర్గం లోనే యువతకు ఉపా ధి కల్పించే విధంగా తాను బాధ్యతలు తీసుకుంటానని చెప్పారు.

సీతానగరం ఏఎస్ఐ మృతి

సీతానగరం: సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న బి.కుమారస్వామి(61) శుక్రవా రం మృతి చెందారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని రెల్ల గ్రామానికి చెందిన కుమారస్వామి బొబ్బిలిలో మృతి చెందగా అంత్య క్రియలు శనివారం స్వగ్రామంలో జరగనున్నాయి. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సిబ్బంది తెలిపారు.గతఏడాది జూన్‌లో ఆయన సీతానగరం బదిలీపై వచ్చారు. గతంలో కూడా ఆయన సీతానగరంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేశారు. కుమారస్వామి మృతికి ఎస్ఐ రాజేష్ సీతానగరం పోలీస్ సిబ్బంది సంతాపం తెలిపారు.

23 మందికి కంటి పరీక్షలు

చీపురుపల్లి: పట్టణంలోని మెట్టకాలనీలో శుక్రవారం మానవీయత, ఆశయ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 23 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 13 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్య క్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు, మానవీయత, ఆశయ సంస్థల ప్రతిని. దులు బీవీ గోవిందరాజులు, రెడ్డి రమణ పాల్గొన్నారు.

31న రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం: రాజాం రచయితల వేదిక సమావేశం ఈనెల 31న ఉదయం 9.30 గంటలకు స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుందని వేదిక నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త రాజాపు కాంతారావు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో వేమన ప్రగతిశీలత అనే అంశంపై బొంతు సూర్యనారాయణ(ప్రవాహి) ముఖ్యప్రసంగం చేస్తారని అనంతరం సభ్యులు స్వీయ రచన పఠనం ఉంటుందన్నారు. రచయితలు, కవులు, భాషాభిమానులు సాహిత్యాభిమానులు హాజరు కావాలని రంగనాథం కోరారు.

విశాఖ బీజేపీ ఇన్‌చార్జిని కలిసిన కోళ్ల

శృంగవరపుకోట: విశాఖ పార్లమెంటు బీజేపీ ఇన్‌చార్జి మేడపాటి రవీంద్రరెడ్డిను శుక్రవారం శృంగవరపుకోట టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. అందరం కలిసి కట్టుగా పనిచేసి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

గొంప కృష్ణను ఇండిపెండెంట్‌గా పోటీచేయిస్తాం

శృంగవరపుకోట: టీడీపీ టిక్కెట్ ఆశించి భంగపడ్డ గొంప కృష్ణను ఇండిపెండెంట్‌గా పోటీ చేయిస్తామని ఎస్.కోట మండలానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు తీర్మానించారు. శుక్రవారం ఎస్.కోట పట్టణంలోని కృష్ణ కార్యాలయంలో విశాఖ పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వీరంతా సమావేశమయ్యారు. పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. నాయకులు జుత్తాడ రామసత్యం ఉన్నారు.

సీట్ల ఎంపికపై పునరాలోచించాలి

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడే నాయకులను గుర్తించి, పార్లమెంటు, అసెంబ్లీ సీట్లు ఎంపికపై పార్టీ అధినాయకత్వం పునరాలోచన చేయాలని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, కూటమి అభ్యర్థులను ప్రకటించే ముందు పార్టీ అధినాయకత్వం స్థానిక నాయకులను సంప్రదించి ఉండాలన్నారు. పార్టీ కోసం ఏళ్లు కష్టపడి జనసేన, టీడీపీ పార్టీల్లో సీనియర్ నాయకులు ఉన్నారని, వారికి ప్రాధాన్యం కల్పించ కుండా జిల్లాలో సంబంధం లేని వారికి సీట్లు కేటాయించారని, ఇప్పటికైనా జనసేన, టీడీపీ అధినాయకత్వం పునరాలోచన చేయాలన్నారు. జనసేన, టీడీపీలోని సీనియర్ నాయకులు సీట్లు కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే యువతకు ఉపాధి

రామభద్రపురం: చంద్రబాబునాయుడు సీఎం అయితే యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని విజయనగరం పార్లమెంటరీ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు అన్నారు. మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం యువతను నిర్వీర్యం చేసిందని, ఉద్యోగాలు లేకపోవడంతో యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో విద్యావంతులు, యువత టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మద్దతు తెలపాలని ఆయన కోరారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

విజయనగరం దాసన్నపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అందరూ రక్తదానానికి ముందుకు రావాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. శుక్రవారం సీతం కళాశాల, విజయదుర్గా యూత్ సొసైటీ సంయుక్తంగా విజయాబ్లడ్ బ్యాంకులో మెగా ఉచిత క్యాంపు నిర్వహించి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షురాలు చంద్రిక మాట్లాడుతూ ఏటా తన తండ్రి జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. డెంటల్, ఆర్థో, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సతీష్, వరలక్ష్మీ, నవత, నారాయణస్వామి, బ్లడ్ బ్యాంకు ప్రతినిధి శివ, సాయి షణ్ముఖ, ఇల్తామస్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం



కాటకాపల్లిలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న లలితకుమారి

లక్కవరపుకోట (కొత్తవలస): శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శుక్రవారం మండలంలోని కాటకాపల్లి, చినరావుపల్లి, గొల్లపేట గ్రామాల్లో టీడీపీ-జనసేన, బీజేపీ నేతలతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. చంద్రబాబు రాష్ట్రానికి ఎంత అవసరమో ప్రజలకు తెలిపారు. మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌కోట రూరల్: ఎస్‌కోట మండలం రామభద్రపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. శుక్రవారం రాత్రి వారిని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాం ప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు.

వాడవాడలా గుడ్‌ఫ్రైడే

- భక్తిశ్రద్ధలతో జరుపుకున్న క్రైస్తవులు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆకట్టుకున్న ఏసు వేషధారణలు



రాజాం: ఏసు ప్రభువు శిలువ మోస్తున్న సన్నివేశం..



ఎస్‌కోటలో..

జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువలో ఊరేగింపు నిర్వహించారు. పాస్టర్లు దైవ సందేశం వినిపించారు.

- ఆంధ్రజ్యోతి బృందం



దత్తిరాజేరు: పెదమానాపురంలో..



బొబ్బిలి పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



తెర్లాం: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోండి

బొబ్బిలి, మార్చి 29: ఈ ఏడాది మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుకుంటన్నారో నిర్ణయించుకొని ప్రతి ఒక్కరూ నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని బొబ్బిలి ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక రాజాకళాశాల మైదానం నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు శుక్రవారం స్వీప్ 2కె వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలు ఏవీ లేకుండా ప్రతిఒక్కరూ ఓటు వేయాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. వచ్చే నెల 15 వరకు కొత్తగా ఓటర్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా , విజయవంతంగా జరిపేందుకు జిల్లా ఎస్పీ, స్థానిక ఆర్వో ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేసుకుంటూ వాక్‌థాన్ నిర్వహించారు. తహసీల్దారు త్రినాథరావునాయుడు, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్, సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, డీటీ రెడ్డి సాయికృష్ణ, సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, వివిధ శాఖల ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



బొబ్బిలిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడాలి



అరసాడలో కోండ్రుకు ఘన స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

రాజాం: వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా గాడి తప్పిందని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం వంగర మండలం బాగెంపేట గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో కోండ్రు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వైసీపీకి చెందిన వెలగాడ శంకర్, కింజంగి బుజ్జి, తదితరులు టీడీపీలో చేరారు. ● రాష్ట్రానికి పట్టిన శని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆ శని పోవాలంటే టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని కోండ్రు మురళీమోహన్ కోరారు. శుక్రవారం అంతికాపల్లి మొగులివలస గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, వల్లూరు గణేష్, గట్టి భాను, దుప్పలపూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, పొట్నూరు లక్ష్మణరావుచందక రాము, వల్లూరు పాపినాయుడు, మజ్జి సత్యం, మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు.

వంగర: చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావటం ఎంతో అవసరమని రాజాం టీడీపీ అభ్యర్థి కోండ్రుమురళి అన్నారు. శుక్రవారం అరసాడలో టీడీపీ మహిళా కార్యదర్శి ధనలక్ష్మీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోండ్రు మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో మాజీ సర్పంచ్ జరజాపు అప్పలస్వామితో పాటు పలువరు టీడీపీ లో చేరారు వారికి కోండ్రూ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు బొత్సవాసు దేవరావునాయుడు, కార్యకర్తలు, నాయకులు పలువురు పాల్గొన్నారు.

కొప్పలవెలమలకు ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న తిరుపతినాయుడు

విజయనగరం దాసన్నపేట, మార్చి 29: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కొప్పలవెలమ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని కొప్పలవెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మనాయన తిరుపతినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రదీప్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయనగరం పార్లమెంటు పరిధిలోని కొప్పలవెలమ సామాజిక వర్గానికి ఎన్నికల్లో టిక్కెట్ కేటాయించకపోవడం, తీవ్ర అసంతృప్తిని మిగిల్చిందన్నారు. జనాభా ప్రాతిపదికన గజపతినగరం అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ బీజేపీ అగ్రకులాలకు పెద్దపీట వేసిందని, కొప్పలవెలమ సామాజిక వర్గానికి ఎక్కడ స్థానం కల్పించలేదన్నారు. ఇప్పటికైనా కూటమి పార్టీ పునరాలోచన చేయాలన్నారు. సమావేశంలో చంద్రినాయుడు, దేవుడుబాబు, అన్నమనాయుడు, కృష్ణమూర్తినాయుడు, ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులకు అడ్డుకట్ట ఏదీ?

శృంగవరపుకోట రూరల్: మండలంలో ఇసుకాసురుల ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. అధిక శాతం అధికారులు ఎన్నికల విధుల్లో మునిగిపోవడం వీరికి మరింత కలిసి వస్తోంది. మండలంలోని వెంకటరమణపేట, కొత్తూరు, కాపుసోంపురం, మామిడిపల్లి, వేములాపల్లి, బొడ్డవర ప్రాంతాల నుంచి నిత్యం యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. వీరికి అధికార పార్టీ చోటా నేతల అండదండలు ఉంటున్నాయి. బొడ్డవర గ్రామాన్ని ఆనుకొని ఐతన్నపాలెం కేంద్రంగా ఇది మరింత జోరుగా సాగుతోంది. ఇక మండల కేంద్రమైన ఎస్.కోటలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్లతో తరలుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి: డీఎస్పీ



అలజంగిలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి, మార్చి 29: మండలంలోని అలజంగి గ్రామంలో శుక్రవారం రాత్రి బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రక్రియ పూర్తిచేయాలని, ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులు, ఒత్తిళ్లకు పాల్పడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నేరాలకు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక శక్తులను ప్రోత్సహించద్దన్నారు. ఎవరి ఓటును వారు సక్రమంగా వినియోగించుకునే పరిస్థితులను కల్పిస్తూ శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు యంత్రాంగానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ హితవు పలికారు. కార్యక్రమంలో సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్ఐ లోవరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



వేపాడలో కవాతు చేస్తున్న పోలీసులు

వేపాడ: సార్వత్రిక ఎన్నికలు ప్రక్రియలో భాగంగా మండలంలోని బొద్దాం-పాటూరు, సోంపురం-అరిగిపాలెం గ్రామాల్లో శుక్రవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలుగా గుర్తింపు పొందిన ఈ నాలుగు గ్రామాల్లో సుమారు 70 మంది పోలీసులు పాల్గొని ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఆయా గ్రామాల్లోని అన్ని వీధులల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్.కోట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఉపేంద్ర,వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్,స్టేషన్ సిబ్బంది,కేంద్రబలగాలు పాల్గొన్నాయి.

బాడంగి: సార్వత్రిక ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు కోరారు. మండలంలోని డొంకినవలస, వీరసాగరం, గజరాయనివలస గ్రామాల్లో శుక్రవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆయుదాలు తీసుకొని గ్రామాల్లోని పురవీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జయంతి పాల్గొన్నారు.

సంకిలి వంతెనకు మరమ్మతులు లేనట్టేనా?

- తారువేసిన కొద్ది రోజులకే యథాస్థితి
- రెండువైపులా రక్షణ గోడ పాడైనా పట్టించుకోని వైనం



మరమ్మతులకోసం ఎదురుచూస్తున్న సంకిలి వంతెన

రేగిడి, మార్చి 29: పాలకొండ- విశాఖ ప్రధాన రహదారిలో సంకిలి వంతెన ఉత్తరాంధ్ర జిల్లాలకు అత్యంత ప్రధాన మార్గం. నలుగుదశాబ్దాల క్రితం సంకిలి వద్ద నాగావళి నదిపై వంతెన నిర్మాంచారు. ప్రస్తుతం ఈ వంతెన మరమ్మతులకు గురైంది. రెండు వైపులా ఉన్న రక్షితగోడలు(హెండింగ్‌వాల్స్) అక్కడక్కడా పాడవ్వగా, వంతెనపై చాలా చోట్ల రిపేర్లు కనిపిస్తున్నాయి. ఇటీవల పాలకొండ-రాజాం రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా ఈవంతెనపై తాత్కాలికంగా మరమ్మతుల పేరుతో గంతలు ఉన్నచోట్ల తారు పూశారు. ఇలా వేసి ఆరునెలలు కాకముందే మళ్లీ తారు తొలగిపోతున్న పరిస్థితి నెలకొంది. గతంలో వంతెన మరమ్మతులను సరైన విధంగా చేయలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గుంతలు ఉన్నచోట్ల ఎక్కువ మొత్తంలో తారువేయటం వంతెనపై స్పీడ్‌బ్రేకర్లు ఉన్నట్లు కనిపిస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఈ పరిస్థితిల్లో ఈతారు అక్కడ్కడా ఊడిపోవటం, వంతెనకు ఉండాల్సిన రక్షితగోడలు పాడవడంపై ఈ ప్రాంతీయులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్న అపవాదు ఉంది. దీనిపై పాలకొండ ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా వంతెన మరమ్మతులకు నిధులు అందుబాటు లేవని, వచ్చినప్పుడు చేస్తామని ఆశాఖ ఏఈ జగన్మోహణరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పెళ్లికి చెప్పడానికి వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో పెళ్లి కొడుకు మృతి
- మరొకరి పరిస్థితి విషమం



షన్ముఖరావు (ఫైల్)

రేగిడి: బైక్, ఆటో ఢీకొన్న ఘటనలో పెళ్లికొడుకు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత పట్నం మండలం కొయ్యగండ గ్రామానికి చెందిన కనుతూరి షన్ముఖరావు(30)కు వచ్చే నెల 20వ తేదీన టెక్కలికి చెందిన యువతితో వివాహం కుదిరింది. ఇందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తన పెళ్లికి లగ్న పత్రికలు ఇచ్చేందుకు చిన్నాన్న నారాయణ రావుతో కలిసి రాజాం బయలు దేరాడు. రాజాం మండలం అమరాంలో దగ్గర బంధువుల శుభకార్యానికి హాజరై భోజనం చేశారు. అనంతరం మరోదగ్గర బంధువు, వీరఘట్టాం మండలం కంబరవలసకు చెందన వెంకటరమణతో కలిసి రాజాం పరిసర గ్రామాల్లో బంధుమిత్రులకు పెళ్లికార్డులు పంచి తిరుగుపయణమయ్యారు. రాజాం నుంచి పాలకొండ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా లచ్చరాయపురం గ్రామం వద్ద ఎదురుగా పాలకొండ నుంచి రాజాం వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో పొలాల్లోకి దూసుకుపోయి బోల్తా పడగా, దిచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు కిందపడ్డారు. వీరిలో షన్ముఖరావు, నారాయణ రావుకు తీవ్ర గాయాలు కాగా, వెనక కూర్చుని ఉన్న వెంకటరమణ స్వల్పగాయాలతో బయటపడ్డారు. అటో డ్రైవర్ కోట వెంకట రమణ, మరో ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలయ్యాయి. వీరందరిని 108లో రాజాం ప్రభుత్వ ఆసపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ షన్ముఖరావు మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నారాయణరావును మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. షన్ముఖరావుది పేద కుటుంబం. ఈయన తండ్రి చిన్నతనంలో చనిపోగా, తల్లి రాజులమ్మతోనే కలిసి జీవిస్తున్నాడు. గ్రామ వలంటీర్‌గా, రైతు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి రేగిడి పోలీస్ స్టేషన్, రాజాం ఆసుపత్రికి చేరుకుని బోరున విలిపించారు. రేగిడి ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తవలసలో చోరీ

లక్కవరపుకోట (కొత్తవలస): ఒక ఇంటిలో చోరీ జరిగి బంగారం, నగదు అపహరణకు గురైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలసకు చెందిన పెదిరెడ్ల ప్రభాకర్ ఆర్టీవో ఆఫీస్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతని భార్య ఆరునెలల క్రితం పుట్టింటికి వెళ్లి.. అప్పుడప్పుడు ఇంటికి వస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ప్రభాకర్ గురువారం రాత్రి తన స్నేహితుడి ఇంటికి వెళ్లి అక్కడే ఉన్నాడు. తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. ఇంటిలోపల ఉన్న బీరువా తెరిచి ఉండడం, అందులో నుంచి 12 తులాల బంగారం, 3.5 కిలోల వెండి, రూ.53వేలు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని సీఐతోపాటు ఎస్ఐ సుదర్శన్ పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలో చిన్నశిర్లాం గ్రామంలో శుక్రవారం స్థానిక పోలీసులు నిర్వహించిన ఎన్నికల సోదాల్లో 48 మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మద్యం బెల్ట్‌షాపు నిర్వహణకు తెచ్చిన మద్యాన్ని పట్టుకుని నిందితున్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో బెల్ట్‌షాపు నిర్వహణపై తీవ్రచర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వేపాడ: మండలంలోని జాకేరు సమీపంలోని నర్సిపిల్లి మెట్ట వద్ద పేకాట శిబిరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్ తెలిపారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసులు దాడి నిర్వహించారని, రూ.లక్ష 3వేలను స్వాధీనపరుచుకున్నట్టు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాదిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట రూరల్: మండలంలో రేవళ్లపాలెం గ్రామంలో మూడురోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయి రోడ్డున పడ్డ చిటికిరెడ్డి అర్జున కుటుంబానికి తాము అండగా ఉంటామని నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ అన్నారు. శుక్రవారం రేవళ్లపాలెం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేలు నగదు అందించారు. కార్యక్రమంలో రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, రేవళ్లపాలెం రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వైసీపీ పాలనతో రివర్స్



జెండావీధిలో ప్రచారం నిర్వహిస్తున్న బేబీనాయన, తెంటు తదితరులు

బొబ్బిలి, మార్చి 29: బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన శుక్రవారం పట్టణంలోని 29 వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బేబీనాయనతో పాటు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామికి మహిళలు పూలమాలలతో ఘనస్వాగతం పలికి హారతులిచ్చి, కుంకుమ దిద్దారు. ఈ ప్రచారంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు రాంబార్కి శరత్ బాబు, సీనియర్ నేతలు రౌతు రామ్మూర్తి, పువ్వల శ్రీనివాస రావు, గెంబలి శ్రీనివాసరావు, కాకల వెంకటరావు, చల్లారపు సత్యనారాయణ, కేతిరెడ్డి కృష్ణమూర్తి, కళ్యంపూడి సత్యనారాయణ, వెలగాడ వాసు, బర్లి శ్రీదేవీబంగారాజు, వార్డు పెద్దలు పామోటి విజయభారతి, రేవళ్ల సత్యవతి, ఎక్కుడు వాసు, చింతాడ రవి తదితరులు పాల్గొన్నారు. **బొబ్బిలి:** బొబ్బిలి పట్టణంలో గల బీజేపీ కార్యాలయానికి టీడీపీ -జనసేన- బీజేపీ అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి శుక్రవారం విచ్చేసి బీజేపీ ఇన్‌చార్జి మరిశర్ల రామారావు నాయుడిని కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ దేశానికి మోడీ నాయకత్వంలో ఎన్‌డీఏ కూటమి పాలన మళ్లీ వస్తుందన్నారు. ఆర్‌ఎస్ఎస్ సారథ్యంలో నడిచే పాఠశాలలో తన విద్యాభ్యాసం జరిగిందని, సమాజం పట్ల బాధ్యత, దేశం పట్ల భక్తిని, విలువలను ఆర్‌ఎస్ఎస్ అందిస్తుందని తెంటు అన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.